రాష్ట్రంలో సువర్ణ పాలన

● ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో సువర్ణ పాలన సాగుతోందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలం గలావల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాన్ని సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. గడిచిన కాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందిందా? లేదా? అనేది తెలుసుకునేందుకు, అర్హులై ఉండి పథకానికి దూరమైతే ఎందుకు దూరమయ్యారనేది గుర్తించి వారికి పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గడపగడపనా తిరిగి అడిగి తెలుసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేసి పంపించారన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాలలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోపాలు ఉన్నా వాటిని తక్షణమే సరిచేసేందుకు గడపగడపకు తిరుగుతున్నామని తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించి రానున్న రోజుల్లో మళ్లీ సీఎంగా చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, ఎంపీపీ నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, వి.గురురాజు, మాధవ నాయుడు, కె.దాలినాయుడు, వాసుదేవరావు, ఎస్.పాపారావు, జగన్, శ్రీనివాసరావు, సత్యంనాయుడు, కామేష్, తదితరులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


గలావల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ


లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలోని పలగర గ్రామానికి చెందిన ఎస్.పద్మావతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.20లక్షల చెక్కును ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం అందచేశారు. పద్మావతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడున్న విషయం ఎమ్మెల్యే జోగారావుకు తెలియపరచడంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోమని సూచించారు. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి నిధులు మంజూరయ్యాయి. దానికి సంబంధించిన చెక్కును బాధిత కుటుంబీకులకు ఎమ్మెల్యే జోగారావు అందజేశారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీకాంత్, ఎంపీపీ నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, పార్టీ నాయకులు, బాధిత కుటుంబసభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆణిముత్యాలు


డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: జగనన్న ఆణిముత్యాలు నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక బైపాస్ రోడ్డులోని సి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌కు కార్యక్రమంలో ప్రతిభా అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, శాసనసభ్యుడు అలజంగి జోగారావు, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పాల్గొంటారన్నారు.

వాహనాల నేడు వేలం

పాచిపెంట: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం వేలం వేయనున్నట్లు ఎస్సై వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో 11 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు ఉంటాయని పేర్కొన్నారు.

కృష్ణారాయపురంలో పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో సర్పంచ్ జి.అన్నంనాయుడు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేయించామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెండు రోజుల పాటు పారిశుద్ధ్య పనుల నిర్వహణతో పాటు కాలువల్లో పూడికలు తీయించినట్లు చెప్పారు. అలాగే పాఠశాలల్లో పేరుకుపేతున్న పిచ్చి మొక్కల తొలగింపు పనులు మరో రెండు రోజుల్లో చేపడతామన్నారు.

లచ్చయ్యపేటలో అభివృద్ధి పనులు

సీతానగరం: ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవ కారణంగా మంజూరుచేసిన నిధులతో మండలంలోని లచ్చయ్యపేటలో సిమెంట్ కాలువలు, సీసీ రోడ్లుపనులు ప్రారంభించినట్లు జెడ్పీటీసీ ఎం.బాబ్జీ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎ.సింహాచలం, గ్రామ పెద్దలు వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లగేజ్ ఆటో బోల్తా: ఒకరికి గాయాలు


చికిత్స పొందుతున్న లక్ష్మణరావు

పాచిపెంట: మండలంలోని మోసూరు సమీపంలో శుక్రవారం లగేజ్ ఆటో బోల్తా పడగా ఒక వ్యక్తి గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం జీగిరాం గ్రామానికి చెందిన సబ్బన లక్ష్మణరావు, గవర శ్రీనివాసరావులు లగేజ్ ఆటోలో పెప్సీ డ్రింకులు వేసుకుని మోసూరు వెళ్లి అక్కడ డ్రింకులు అన్‌లోడ్ చేసుకుని తిరిగి వస్తుండగా మోసూరు గ్రామ శివారులో లగేజ్ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సబ్బన లక్ష్మణరావుకు తీవ్ర గాయాలయ్యాయి, వెంటనే స్థానికులు 108 సహాయంతో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జియ్యమ్మవలస: మండలంలోని పేదమేరంగి గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై కేసు నమోదైనట్లు ఎస్ఐ కళాధర్ తెలిపారు. ఈ నెల 13వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇంతవరకు ఇంటికి రాకపోవడంతో గురువారం రాత్రి ఆమె భర్త ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్నామని, ఆమె ఆచూకీ తెలిస్తే ఫోన్ నంబర్ 9121109478కు సమాచారం ఇవ్వాలని తెలిపార

ఎంసెట్‌లో ర్యాంకర్స్‌కు ఎమ్మెల్యే అభినందన


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే జోగారావు స్థానిక ఆర్‌కే కళాశాలలో శుక్రవారం అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించినప్పుడు భవిష్యత్ జీవితంలో వారు ఉన్నత స్థానాలను అధిరోహించడానికి ఉన్నతాశయంతో ముందుకు సాగుతారన్నారు. వారు వేసే ప్రతి అడుగులోనూ ఇచ్చే ప్రేరణ ఎప్పటికీ గుర్తుంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు రణభేరి చిన్నం నాయుడు, రణభేరి శివకుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వి.గురురాజు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలుకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటరమణ, ప్రజా ప్రతినిధులు

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిదులు శుక్రవారం సత్కరించారు. ఈ మేరకు 10 వ తరగతిలో మొదటి, రెండవ, మూడవ రాంక్‌లు సాధించిన గలావిల్లి భారతి, చిట్టపల్లి శ్రావణి, పెంకి స్రవంతిలకు మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు బహూకరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరమణ, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు వి.తవిటినాయుడు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు


ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివ్వాం పంచాయతీలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని అన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే పరమావధిగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. టీడీపీని గెలిపిస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఏవీ ఉండవన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న ప్రభుత్వంపై టీడీపీ అండ్ కో.., ఎల్లోమీడియా చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదన్నారు. 2024లోనూ తమ పార్టీదే విజయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్ ఆర్.పోలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు జి.అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ రహిత సమాజానికి కృషి చేయాలి

సీతానగరం: రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల సూచనలు, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం వివిధ కళాశాలల్లో డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు అందరూ సహకరించాలని కోరుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై కె. నీలకంఠం తెలియజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న పాఠశాలలు కాలేజీలున్న జోగింపేట, సీతానగరం, చినభోగిలి గ్రామాల వద్ద వివిధ రకాల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. డ్రగ్స్ అంటేనే మరణమని, విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్ రహితసమాజమే ధ్యేయంగా విద్యార్థులుండాలని సూచించారు. డ్రగ్ విషయమై ఎటువంటి సమాచారం ఉన్నా నిర్దేశించిన టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లపై కేసు


మండలంలోని సువర్ణముఖినది బూర్జ రేవులో ఇసుక లోడ్ చేస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్సై కె నీలకంఠం తెలియజేశారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు


దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్‌కుమార్

పాలకొండ: బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్‌కుమార్ హెచ్చరించారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం వారోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని పలు దుకాణాల్లో ఆయన శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎక్కడైనా బాలలు గానీ బడిఈడు పిల్లలు గానీ పనిచేస్తున్నారన్న విషయంపై ఆరాతీశారు. ఎవరైనా పిల్లలు పనికోసం వస్తే బడికి పంపించాలని తెలిపారు. ఆయన వెంట సీనియర్ న్యాయవాది ఉత్తరావల్లి మురళీమోహన్ తదితరులు ఉన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించాలి


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి, త్వరలో చేపట్టబోయే సోషల్ ఆడిట్‌కు సహకరించాలని ఎంపీపీ భాను బొమ్మాళి భాను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది శుక్రవారం సమావేశమయ్యారు. 2022 ఏప్రిల్-2023 మార్చి మధ్య కాలంలో జరిగిన ఉపాధి పనులపై క్షేత్రస్థాయిలో ఆడిట్ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో పర్యటించే ఆడిటర్లకు పూర్తి వివరాలు అందజేస్తూ సిబ్బంది సహకరించాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, ఎంపీడీఓ డొంక త్రినాధులు, ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆయుష్మాన్ భారత్ సర్వే

గుమ్మలక్ష్మీపురం:

మండలంలోని దుమ్మంగి, రెల్ల, కేదారిపురం హెల్త్ సబ్‌సెంటర్ల పరిధిలో ఆయుష్మాన్ భారత్ సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. పంచాయతీ కార్యదర్శులు, వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, జ్వరపీడితులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను ఎన్‌డీసీ యాప్‌లో నమోదు చేస్తున్నారు. తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు మాట్లాడుతూ సర్వే అనంతరం బాధిత కుటుంబాలకు ప్రత్యేక కార్డులు మంజూరు చేసి, ప్రభుత్వం కల్పించే సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ బి.సునీత, ఎంపీహెచ్‌ఏ పి.రాధాకృష్ణ, ఏఎస్ఎం చంద్రకళ, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామంలో ఆయుష్మాన్ భారత్ సర్వే శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ డొంక త్రినాధుల పర్యవేక్షణలో వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, జ్వరం బారినపడిన వారు ఎవరైనా ఉన్నారా.. దీర్ఘకాలిక వ్యాధులతో ఎవరైనా బాధపడుతున్నారా అని ఆరాతీశారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గరుగుబిల్లి: ఆయుష్మాన్ భారత్ సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కె.సాగర్ వర్మ హెచ్చరించారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని గొట్టివలస, ఉల్లిభద్ర, పెద్దూరు గ్రామాల్లో నిర్వహించిన సర్వేను పరిశీలించిన ఆయన ఈ నెల 17వ తేదీ వరకు జరిగే ఈ సర్వేను పక్కాగా చేపట్టాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి, జ్వరపీడితులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి, ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు.


కేదారిపురం సబ్‌సెంటర్ వద్ద ఆయుష్మాన్ భారత్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

ఖరీఫ్ విత్తనాలు పంపిణీకి సిద్ధం

● అందుబాటులో 25వేల క్వింటాళ్లు
● జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్



పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఖరీఫ్ కాలానికి విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి విత్తనాలు 25వేల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, రైతు సోదరులు డి-కృషియాప్‌లో నమోదు చేసుకుని, ధర చెల్లించి విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చునని సూచించారు. కందులు-320 క్వింటాళ్లు ఉన్నాయని, రైతుమిత్రులు వీటిని 100శాతం రాయితీతో పొందవచ్చని అలాగే వరి విత్తనాలు 25వేల క్వింటాళ్లు ఉన్నాయని, అందులో 8వేల క్వింటాళ్లు 90శాతం రాయితీతో గిరిజన ప్రాంతాలలో గిరిజనులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాగులు 87 క్వింటాళ్లు, వేరుశనగ 50 క్వింటాళ్లు 100 శాతం రాయితీతో అందిస్తామని, ఇందులో ఎస్సీ,ఎస్టీ వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

బందల్లో ఆక్రమణలు తొలగించాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న లచ్చయ్యపేట గ్రామస్తులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కర్మాగారం సమీపంలో రియల్ వ్యాపారస్తులు ఆక్రమించిన బంద స్థలాలను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు కృపారావు, శ్రీరాములు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా జరిగింది. ఈ మేరకు వారు మాట్లాడుతూ గ్రామానికి అత్యవసరమైన పరిస్థితుల్లో అవసరమైన నీరు నిల్వ ఉండేలా గ్రామస్తులమంతా బందలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఆ బందలను పూడ్చిన రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులు స్థలాలుగా తయారుచేసి విక్రయాలు చేశారని ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల్లో బందల్లో ఉన్న నీరు పశువులకు, అగ్ని ప్రమాద సమయాల్లో వినియోగిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా అనంతరం తహసీల్దార్ ఎన్వీ రమణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బద్దాన అప్పారావు, కె రామానందం తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో ఉద్యోగావకాశాలు

కురుపాం:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం జరిగిన మెగా జాబ్‌మేళాను సందర్శించిన ఆమె 10 కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీల్లో ఉద్యోగాలకు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారని, మొత్తం 286 మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా, 69 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని తెలిపారు. సీఎం జగనన్న ఆదేశాల మేరకు ప్రతీ నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించి, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తుండడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

భయపెడుతున్న డయేరియా

● బొద్దిడిలో ప్రబలిన డయేరియా
● వ్యాధి బారినపడిన 25 మంది
● దుడ్డుఖల్లు పీహెచ్‌సీలో చికిత్స

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బొద్దిడి గ్రామాన్ని డయేరియా వ్యాధి భయపెడుతోంది. విరేచనాలు, జ్వరం, వాంతులు, దాహం, నోరు ఎండిపోవడం, చర్మం పొడిబారడం, కడుపులో నొప్పి వంటి లక్షణాలతో దాదాపు 25 మంది గ్రామస్తులు దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో చేరారు. అప్రమత్తమైన వైద్యాధికారి ప్రవీణ్, సిబ్బంది కలిసి అక్కడికి వచ్చే రోగులకు సత్వరమే చికిత్స అందజేస్తున్నారు. బాధితుల్లో ఐదుగురిని మెరుగైన వైద్యం కోసం కురుపాం ఆస్పత్రికి తరలించారు. మిగతా 20 మందిని దుడ్డుఖల్లు పీహెచ్‌సీలోనే సేవలందిస్తూ పరిశీలనలో ఉంచినట్లు వైద్యాధికారి తెలిపారు. గ్రామాన్ని వైద్య సిబ్బంది సందర్శించి, డయేరియా సోకడానికి గల కారణాలపై గ్రామస్తులను ఆరాతీశారు. వ్యాధి సోకేందుకు గ్రామంలో తాగునీరే కారణమని, తేలింది. దీంతో తక్షణమే తాగునీటి ట్యాంక్‌లో క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. బొద్దిడి గ్రామస్తులు డయేరియా బారినపడుతున్న విషయం తెలుసుకున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్ బాధితులు చికిత్స పొందుతున్న పీహెచ్‌సీకి వెళ్లి, పరిస్థితి సమీక్షించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటరమణను ఆదేశించారు.


దుడ్డుఖల్లు పీహెచ్‌సీలో రోగులకు వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారి ప్రవీణ్


డయేరియాతో కురుపాం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బొద్దిడి గ్రామ మహిళ

గిరిజన పాఠశాలల్లో సౌకర్యాల పరిశీలన

భామిని:

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని సౌకర్యాలను మండల అధికారులు పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏ మేర ఉన్నాయో చూసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే విద్యార్థులకు చేస్తున్న విద్యాబోధనను గమనించారు. నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ఉపాధ్యాయులు దృష్టిసారించాలని సూచించారు. పీఓ ఆదేశాల మేరకు మండలంలోని 12 పాఠశాలలను సందర్శించినట్లు ఈఓ ఆర్‌డీ కృష్ణారావు తెలిపారు.


భూర్జగూడ పాఠశాల సౌకర్యాలపై ఆరాతీస్తున్న ఈఓఆర్‌డీ కృష్ణారావు